


ప్రతి విద్యార్థికి పదో తరగతి కీలకం. పక్కా ప్రణాళికతో చదివితే మంచి మార్కులతో ఉత్తీర్ణులవడం పెద్ద కష్టం కాదు. చదువుపై ఏకాగ్రత..విజయం సాధించాలని పట్టుదల ఉంటే పదిలో మెరవడం ఖాయం. టెన్త్ పరీక్షలు మార్చి 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. సమయం సమీపిస్తుండటంతో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు సైతం మంచి ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. పరీక్షల భయం పోవాలంటే విద్యార్థులు పక్కా ప్రణాళికతో సాధన చేయాలి. అలాగే మానసిక, శారీరకంగా దృఢంగా ఉంటేనే ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆశించిన ఫలితాలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. -సీతమ్మధార





ప్రత్యేక తరగతుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

'పది' టార్గెట్ 100 శాతం

- టెన్త్ పరీక్షలకు 168 మంది విద్యార్థుల సన్నద్ధం
- ఎన్‌ఎంసీహెచ్‌లో ప్రత్యేక తరగతులు
- శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాబోధన



డిజిటల్ పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

పీఅండ్‌టీ కాలనీలోని నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించడమే లక్ష్యంగా శ్రమిస్తున్నారు. ఇప్పటివరకు సైన్స్, సోషల్ స్టడీస్ మినహా మిగిలిన అన్ని సబ్జెక్టుల సిలబస్ పూర్తయింది. ఈ రెండు సబ్జెక్టులు కూడా 20వ తేదీ నాటికి పూర్తి చేస్తామని ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాలలో ప్రతి రోజూ సబ్జెక్టుల వారీగా పరీక్షలతో పాటు ప్రత్యేక తరగతులు కూడా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 10వ తరగతి 168 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో 61 మంది బాలురు, 107 మంది బాలికలు. గత ఏడాది 225 మంది పరీక్షలు రాయగా, 75 శాతం ఉత్తీర్ణత వచ్చింది. ఈ ఏడాది వంద శాతం ఫలితాలు సాధిస్తామన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు గ్రూపులుగా విభజించి: మొత్తం విదార్థులను 4 గ్రూపులు (ఏ,బీ,సీ,డీ) గ్రూపలుగా విభజించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

తల్లిదండ్రుల పాత్ర కీలకం

పరీక్షల సమయంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకం. పిల్లలను చదువు విషయమై ప్రోత్సహించాలని, వారిని తిట్టడం వంటివి చేయకూడదు. చదువుకునే గది ప్రశాంతంగా, వెలుతురు, గాలి వచ్చేలా ఉండాలి. పరీక్షలంటే భయపడవద్దని, సానుకూల దృక్పథంతో ఉండాలని సలహాలు ఇవ్వాలి.

ఉత్తమ బోధన



అమ్మ గృహిణి, నాన్న లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. జీవీఎంసీ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నా..ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా శిక్షణ ఇస్తున్నారు. సందేహాలను నివృత్తి చేస్తున్నారు. నిత్యం పరీక్షలు నిర్వహించి భయం లేకుండా చేస్తున్నారు. నాలుగు గ్రూపులుగా విడదీసి చదువులో వెనుకబడిన వారిపై దృష్టి సారిస్తున్నారు. కచ్చితంగా మేమంతా మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తాం.

-సౌజన్య

చక్కగా శిక్షణ



అమ్మ వంట మనిషి. నాన్న తాపీ మేస్త్రిగా పని చేస్తున్నారు. ఇదే పాఠశాలలో నేను పదో తరగతి చదువుతున్నా. అమ్మానాన్నల కష్టం తెలుసు. అందుకే పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఇంటర్‌లో ఫ్రీ సీటు సాధిస్తా.. అందుకు ఇక్కడ ఉపాధ్యాయులు తనకు ఎంతో చక్కగా శిక్షణ ఇస్తున్నారు. పాఠశాల యాజమాన్యం ద్వారా సాక్షి స్టడీమెటీరియల్ తరగతిలో మా అందరికీ అందించారు. మంచి మార్కులు సాధించడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది.

-మడిచర్ల మేనక, పదో తరగతి.

పరీక్షల భయం పోయింది



నేను నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి 'డి' సెక్షన్‌లో చదువుతున్నాను. అమ్మ గృహిణి, నాన్న ఓ హోటల్‌లో మేనేజర్‌గా పని చేస్తున్నారు. పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్నాం. మాకు ఎటువంటి పరీక్షల భయం లేదు. ఉపాధ్యాయులు చెప్పినట్టు చదువుకుంటున్నాం. దాదాపు అన్ని సబ్జెక్టులపై పట్టు ఉంది. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తానన్న నమ్మకం ఉంది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కలలను నిజం చేస్తా.

-బి.సాయి, విద్యార్థిని

క్లుప్తంగా

రైతు బజార్ తనిఖీ



రైతులతో మాట్లాడుతున్న విజిలెన్స్ టీం డిప్యూటీ డైరెక్టర్ పాపారావు

సీతంపేట: రైతుబజార్‌లో విక్రయించే అన్ని రకాల కూరగాయలు రైతుల నుంచి మాత్రమే తీసుకురావాలని, హోల్‌సేల్ వ్యాపారులు, దళారుల నుంచి కాదని విజిలెన్స్ టీం డిప్యూటీ డైరెక్టర్ పి. పాపారావు అన్నారు. నరసింహనగర్ రైతుబజార్‌లో మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. బజార్‌లో స్టాల్స్ పరిశీలించారు. రైతులు పండిస్తున్న పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు పండించిన పంటలే బజార్‌లో విక్రయించాలని, హోల్‌సేల్ మార్కెట్‌లో కొనుగోలు చేసి రైతుబజార్‌లో విక్రయించరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కిరణ్ , ఎస్.కె.యాసిన్, సెక్రటరీ అరుణ, అసిస్టెంట్ సెక్రటరీలు శ్రీలక్ష్మీ చైతన్య, ఋజారు ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు ఆర్. సత్యనారాయణ పాల్గొన్నారు.


యోగ సిద్ధాంజనేయుడుకి సింధూర అర్చన



ప్రత్యేకలంకరణలో దర్శనమిచ్చిన యోగ సిద్ధాంజనేయుడు

మురళీనగర్: జాతీయ రహదారి సూర్య నగర్‌లో వెలసిన యోగ సిద్ధాంజనేయ స్వామికి మంగళవారం సింధూర అర్చన చేశారు. ఆలయ అర్చకులు శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో పాంచరాత్ర ఆగమ పంప్రదాయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉదయం 8 గంటలకు సింధూర అర్చన, తమలపాకులతో పూజలు చేశారు. సన్నిధానంలో భక్తులచే సామూహికంగా సుందరాకాండ పారాయణం జరిగింది. యోగ సిద్ధాంజనుయుడిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పెనుమత్స సుబ్బరాజు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా పార్వతీశ్వరుని ఊరేగింపు



ప్రత్యేక రథంపై ఊరేగుతున్న పార్వతీశ్వరుడు

సీతంపేట: స్థానిక పార్వతీశ్వరాలయంలో జరుగుతున్న పార్వతీశ్వరుని 35వ వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా మంగళవారం సాయంత్రం సారెతో స్వామి వారి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. మహిళలు సారెతో వెంటరాగా ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామి వారి ఆశీనులయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు గంగవరపు శివాజీశర్మ, భాస్కరశర్మ, కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేద విజ్ఞానం మానవాళికి మార్గదర్శకం

ఎంవీపీకాలనీ: సనాతన భారతీయ మహారుషులు అందించిన పురాణ, ఇతిహాస, వేదాల విజ్ఞానం మానవాళి మనుగడకు మార్గదర్శకమని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. ఋషిపీఠం సత్సంగ శాఖ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని భద్రం పార్క్ వేదికగా జరుగుతున్న కార్యక్రమంలో శ్రీ మహా గణపతి వైభవంపై మంగళవారం ఆయన అనుగ్రహభాషణం చేశారు. వేద, పురాణ, మంత్ర శాస్త్రాల సహిత శ్రీ మహా గణపతి వైభవాన్ని విశదీకరించారు. ఋషులు అందించిన ఈ విజ్ఞానాన్ని ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రవచనాల ద్వారా ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. అనంతరం భక్తులతో మహా గణపతి మంత్రాలను చెప్పించారు.

పోర్టు హాస్పటల్ ప్రైవేటీకరణ ఆపే వరకు పోరాటం



పోర్టు హాస్పటల్ వద్ద దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: పోర్టు హాస్పటల్ ప్రైవేటీకరణ ఆపేవరకు పోరాటం చేస్తామని, సొంత నిధులతోనే పోర్టు హాస్పటల్‌ను అభివృద్ధి చేయాలని సీఐటీయూ అధ్యక్షుడు జె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. పోర్టు హాస్పటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న రిలే నిరాహారదీక్షలు మంగళవారానికి 142వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్న సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయలు లాభాలు సంపాదిస్తున్న పోర్టు, అందులో పనిచేసే ఉద్యోగుల ఆరోగ్యంతో వ్యాపారం చేయడం సమంజసం కాదన్నారు. ఈ సంవత్సరం సుమారు రూ.800 కోట్లు లాభాలు వచ్చాయని, దీంట్లో నాలుగోవంతు ఖర్చుపెట్టినా ఈ హాస్పటల్‌లో ఖాళీగా ఉన్న డాక్టర్స్, సిబ్బందిని నియమించవచ్చని, ఈ రకంగా ఆలోచించకుండా ప్రైవేటు వాళ్లకి ధారాదత్తం చేయాలనుకోవడం దుర్మార్గమైన చర్య అని తెలిపారు. వెంటనే ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేకుంటే నిరసనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మంగళవారం జరిగిన దీక్షలో సత్యనారాయణ, ఎస్ సాధుబాబు, జీసీహెచ్‌వై నాయుడు, రాజగోపాలరావు, సీహెచ్ వీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా సులభ్ కాంప్లెక్సు



ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్న సులభ్ కాంప్లెక్సు

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 24 వార్డు నక్కవానిపాలెంలో సులభ్ కాంప్లెక్సు నిరుపయోగంగా మారింది. 2002 ఏప్రిల్ సులభ్ కాంప్లెక్సును నాటి 26వ వార్డు కార్పొరేటర్ పెందుర్తి పుష్పాంజలి ప్రారంభించారు. ఐదేళ్ల క్రితం నుంచి సులభ్ కాంప్లెక్సు మరమ్మతులకు గురైంది. నాటి నుంచి నేటి వరకూ అటు అధికారులు, ఇటు నాయకులు పట్టించుకోవడం మానేశారు. వివిధ పనులపై వచ్చిన వారికి ప్రజా మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జోన్–3 ప్రజారోగ్యశాఖ అధికారులు స్పందించి ఈ సులభ్ కాంప్లెక్సును వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

కుంభమేళాకు బయలుదేరిన ఆర్టీసీ సర్వీస్



కుంభమేళా బస్సును ప్రారంభిస్తున్న జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి అప్పలనాయుడు

దాబాగార్డెన్స్: ద్వారకా బస్ స్టేషన్ నుంచి కుంభమేళా (ప్రయోగరాజ్)కు మంగళవారం మరో ఆర్టీసీ సర్వీస్ బయలుదేరి వెళ్లింది. జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి బి. అప్పలనాయుడు యాత్ర బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ ఈ యాత్ర ఏడు రోజుల పాటు వివిధ పుణ్యక్షేత్రాలు చూపించి ప్రయోగరాజ్ చేరుకుని అక్కడి నుంచి తిరిగి విశాఖ రానుందని తెలిపారు. యాత్రలో ప్రయోగరాజ్‌తో పాటు అయోధ్య, వారణాసి పుణ్యక్షేత్రాలు దర్శించుకునేలా రాను, పోను 7 రోజుల యాత్ర సాగనుందని తెలిపారు. ప్రయోగరాజ్, కాశీ క్షేత్రాల్లో ఒక రోజు బస ఉంటుందని అప్పలనాయుడు తెలిపారు. ఒక్కొక్కరికి టికెట్ ధర రూ.8 వేలని, విశాఖ జిల్లా నుంచి ఈ బస్సు ఎవరికైనా కావలిస్తే విశాఖపట్నం డిపో మేనేజర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి. సత్యనారాయణ, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పీబీఎంకే రాజు, విశాఖపట్నం డిపో అసిస్టెంట్ మేనేజర్ పి. ఉజ్వల, అసిస్టెంట్ ఇంజినీర్ రామకృష్ణ, పలువురు సూపర్‌వైజర్లు ద్వారకా బస్‌స్టేషన్లో ఈ బస్సును పర్యవేక్షించారు.

20న మరో బస్సు

ప్రయాణికుల అభ్యర్థన మేరకు మరో బస్సు ఈ నెల 20న సాయంత్రం 6 గంటలకు ద్వారకా బస్‌స్టేషన్ నుంచి బయలుదేరుతుందని, టికెట్ ధర రూ.8 వేలుగా నిర్ణయించామని అప్పలనాయుడు తెలిపారు. టికెట్లు కావల్సిన వారు ఆన్‌లైన్‌లో గాని, సమీప బస్‌స్టేషన్‌లో గాని సంప్రదించాలని, మరిన్ని వివరాలకు 7095605769, 8978200455 నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

అద్దె చెల్లింపు వివాదంలో కత్తితో దాడి

ఎంవీపీకాలనీ: అద్దె చెల్లింపు విషయంలో చిట్టిమూరి రాజు (28) అనే వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన ఎంవీపీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సత్యం కూడలి జయభేరి దరి చైతన్య నగర్‌లో చిట్టిమూరి రాజు అతని స్నేహితులు నాని, వరుణ్ చాలా కాలంగా అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఇటీవల నాని అనారోగ్యంతో ఉన్న తన మామను చూసుకోవడం కోసం కాకినాడ వెళ్లాడు. ఆ సమయంలో మహేష్ అనే అతని స్నేహితుడిని ఆ అద్దె ఇంట్లో ఉంచాడు. అయితే ఇటీవల అద్దె చెల్లించే సమయంలో చిట్టిమూరి రాజు నానికి ఫోన్ చేసి అద్దె ఇవ్వాలని కోరాడు. తన స్థానంలో స్నేహితుడు మహేష్ ఉంటున్న నేపథ్యంలో అతని ద్వారా తన వంతు అద్దె సొమ్ము చెల్లించాలని నాని కోరాడు. మహేష్‌కు ఫోన్ చేసి అద్దె రాజుకు ఇవ్వాలని చెప్పాడు. అయితే మహేష్ అద్దె సొమ్ము చెల్లించకపోగా రాజుపై బెదిరింపులకు దిగాడు. దీంతో వారి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంటికి వచ్చిన మహేష్ తనతో పాటు తెచ్చుకున్న కత్తితో దాడి చేశాడు. రాజు ఛాతీతో పాటు మెడ ఎడమ భాగంలో కత్తితో పొడిచాడు. రాజు నుంచి రూ.600 లాక్కుని పరారయ్యాడు. ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో రాజుని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై చిట్టిమూరి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహేష్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎంవీపీ పోలీసులు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను మంగళవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 8.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు... విశాఖ రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎస్ రామారావు, ఆర్పీఎఫ్ /ఐపీఎఫ్ ఎస్‌ఐ రామకృష్ణ, సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. కేరళ రాష్ట్రం, కోల్లాం జిల్లాకు చెందిన అమల్ ఎస్‌ఆర్ గంజాయి రవాణా చేయడాన్ని గుర్తించారు. నిందితుడిని జీఆర్పీ ఎస్‌ఐ ఎస్ రామారావుకు అప్పగించారు. రూ.42,500 విలువైన 8.5కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడ్ని అరెస్టు చేసి..రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

శిథిలావస్థలో అంగన్‌వాడీ కేంద్రం



పెచ్చులు ఊడిపోతున్న అంగన్‌వాడీ శ్లాబు

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 24వ వార్డు నక్కవానిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరిందని పిల్లల తల్లిదండ్రులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఇక్కడి వివేకానంద కల్యాణమండపం దరి అంగన్‌వాడీ కేంద్రంలో సుమారుగా 20మంది పిల్లలు, సిబ్బంది ఉంటున్నారు. ఈ కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారం కోసం గర్భిణులు, బాలింతలు వస్తుంటారు. కాగా ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో పెచ్చులు ఊడిపోతున్నాయి. వర్షాకాలంలో భయంభయంగా విధులు నిర్వహిస్తున్నామని సిబ్బంది వాపోతున్నారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో శ్లాబు, గోడలు పెచ్చులూడిపోవడంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఐసీడీఎస్ అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ప్రణాళికతో చదివితే మంచి మార్కులు

డీఈవో ప్రేమ్‌కుమార్



ఇస్లాంపేట జెడ్పీ హైస్కూల్‌లో డీఈవో ప్రేమ్‌కుమార్

పెదగంట్యాడ: ప్రణాళిక ప్రకారం చదివితే మంచి మార్కులు వస్తాయని జిల్లా విద్యా శాఖాధికారి ప్రేమ్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థులతో సంభాషించారు. ప్రతి ఒక్కరూ బాగా చదవాలని, మంచి మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణులు కావాలన్నారు. ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే దానికి చదువే ముఖ్య కారణమన్నారు. విద్యార్థి దశలోనే లక్ష్యాలను ఏర్పరచుకోవాలని, వాటిని సాధించేలా శ్రద్ధతో చదవాలని సూచించారు. పదో తరగతి పరీక్షలకు సమయం దగ్గర పడుతోందని, విద్యార్థులు ఆందోళనకు లోను కాకుండా పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వారు కూడా చదువులో ముందుండేలా సిద్ధం చేయాలన్నారు.

రద్దీలేని సర్వీసు రోడ్డులో నో పార్కింగ్ బోర్డులు



సర్వీసు రోడ్డులో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 24వ వార్డు నక్కవానిపాలెంలో సర్వీసు రోడ్డులో ద్వారకా ట్రాఫిక్ పోలీసులు ఇటీవల నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేయడం విస్మయానికి గురి చేస్తోంది. నక్కవానిపాలెం నుంచి సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే ఈ రోడ్డులో పెద్దగా ట్రాఫిక్ ఉండదు. కాగా ఈ రోడ్డును ఆనుకుని ఉన్న ప్రజలు తమ ఇళ్ల ముందు వాహనాలు పార్కింగ్ చేసుకోవడం ఎన్నో ఏళ్ల నుంచి ఆనవాయితీగా వస్తుంది. ఈ నేపథ్యంలో ఇటీవల ఈ ప్రాంతంలో నో పార్కింగ్ అంటూ ట్రాఫిక్ పోలీసులు బోర్డులు ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలు అవాక్కయ్యారు. తమ ఇంటి ముందు వాహనం పార్కు చేసుకుంటే పోలీసులు వచ్చి ట్రాఫిక్ చలానాలు రాస్తుండడంతో ప్రజలు హడలిపోతున్నారు.ఇంటి ముందు కారు పార్క్ చేస్తే రూ.1,100 వంతున ఫైన్లు వేస్తున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ద్వారకా ట్రాఫిక్ పోలీసులు స్పందించి నో పార్కింగ్ బోర్డులను తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయమై ద్వారకా జోన్ ట్రాఫిక్ సీఐ కేఎస్‌ఎన్‌వీ ప్రసాద్‌ని వివరణ కోరగా, స్థానిక ప్రజలు కొందరు ఇటీవల సీపీ శంఖబ్రత బాగ్చీకి ఫిర్యాదు చేసిన నేపథ్యంలోనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు.

కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణకు కృషి



ప్రసాదరావుకు సంఘీభావం తెలుపుతున్న పార్టీ ప్రతినిధులు

సీతంపేట: బహుజన్ సమాజ్ పార్టీ బలపరిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పెదపెంకి శివప్రసాదరావు పరిచయ కార్యక్రమం మంగళవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. బహుజన్ సమాజ్ పార్టీ జోనల్ కన్వీనర్ లకే రాజారావు ఎమ్మెల్సీ అభ్యర్థిని పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా అంకితభావంతో పనిచేసి, ఐదేళ్ల సర్వీస్ ఉండగానే ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో స్వచ్ఛంద పదవీ విరమణ చేశారని తెలిపారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పెదపెంకి శివప్రసాదరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసాదరావు మాట్లాడుతూ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేసే జీవోను అమలు చేయిస్తానని హామీ ఇచ్చారు. యూనివర్సిటీలలో శాశ్వత అధ్యాపకుల నియామకం కోసం పోరాడతానని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సమన్వయ కమిటీ చైర్మన్ కట్టా మల్లేశ్వరరావు, సర్వే సురేష్, భీమరశెట్టి విశ్వనాథం, దాసరి సూర్యనారాయణ, రమేష్, రమణ పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం



ప్రత్యేక అలంకారంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

సీతమ్మధార: జీవీఎంసీ పరిధి 24 వార్డులోని నక్కవానిపాలెంలోని శ్రీ ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, ఆంజనేయస్వామి ఆలయాల వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు అర్చకుడు రామారావు శర్మ తెలిపారు. అనంతరం ఆంజనేయ స్వామి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పంచామృతాభిషేకం, ఫలాభిషేకం నిర్వహించామన్నారు. ఆలయ నిర్మాణ దాతలు జి.వాసుదేవ వర్మ, జ్యోతి దంపతుల సహాయ సహకారాలతో ప్రత్యేక పూజలు చేస్తున్నట్లు తెలిపారు. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.